

# నా కళ్ళతో నాన్న

- లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**వయసొచ్చిన పిల్లలకి** పెళ్ళి చెయ్యడం ప్రతి తల్లి తండ్రికి ఓ పెద్ద బాధ్యత. కన్యాదానం పూర్తిచేసి చేతులు దులుపుకోవడానికి ఎదురు చూస్తుంటారు. కొందరి కులమతాల పట్టింపు, కొందరికి ఆస్తి అంతస్తుల పట్టింపు. "అది చేసుకున్న అబ్బాయి జేబులో పైసా ఉండదు. అన్నీ అత్తగారే కొనిస్తారు" అనో, "వాడు వేరే కులానికి చెందిన అమ్మాయిని చేసుకుని ఆచారాలు మంట కలిపాడు" అనో ఆకాయ్ పోకాయ్ కబుర్లు చెప్పుకునేవారు నా భర్తగురించి, కావ్య భర్త గురించి ఏమీ అనలేక "ఈడొచ్చిన పిల్లలకి పెళ్ళి చెయ్యకుండా ఊళ్ళు తిరుగుతున్నారు" అని మా అమ్మని అంటారు. మా నాన్న జోలికి వచ్చే ధైర్యం ఎవరికీ లేదు. పొరపాటున వచ్చిన వారు మాకు తిరిగి కనబడలేదు.

తనకాళ్ళపై తను నిలబడడం ఎంత ముఖ్యమో తెలిసిన మా అమ్మా, నాన్న మేము స్థిరపడేంత వరకు పెళ్ళి ప్రసక్తి ఎత్తలేదు. "అరేంజ్డ్ మేరేజ్‌లో అబ్బాయి గురించి పూర్తిగా తెలుసుకోవడం కష్టం. అబ్బాయిలో ఉన్న చెడు పెళ్ళైన రెండేళ్ళకి కానీ తెలీదు. కానీ నువ్వు చూడమంటే సంబంధాలు వెతుకుతాను" అని మా నాన్న, "నువ్వెవ్వరిని చేసుకుంటాను అన్నా ఫరవాలేదు. కానీ నిన్ను ప్రేమించే వాడైతే చాలు" అని మా అమ్మ, "మేరీ ఓన్లీ ఫర్ లవ్" అని కావ్య నాతో అన్నారు. పాల పాకెట్ కొనడానికి కూడా భర్త మీద ఆధారపడినవారు "పండు, పెళ్ళయ్యాక జాబ్‌ని మాత్రం మానకు" అని చెప్పారు. మాట్లాడిన ప్రతీసారి "నీ పెళ్ళెప్పుడు?" అని అడిగిన జనాల ప్రశ్న నాకు చిరాకు కలిగించినా, "ఈ సంవత్సరమైనా నీ పిల్లలకి పెళ్ళిచేస్తావా?" అన్న ప్రశ్నకి మా అమ్మ విసిగిపోయినా ఎన్నడూ వత్తిడి చెయ్యక పోవడం నాక్కూడా ఆశ్చర్యంగానే ఉంది.

"పద్మజ పిల్లలు పొట్టిబట్టలేసుకుంటారు" అనేవాళ్ళ కూతుళ్ళు, కోడళ్ళు పొడుగు వస్త్రాలు ధరించకపోవడం, "పద్మజ పిల్లలు జుట్టు కత్తిరించుకుంటారు" అనేవారికి తాచుపాములాంటి జడ ఉండకపోవడం మమ్మల్ని బాగా నవ్విస్తుంది. పాశ్చాత్యంగా ఆలోచించే మా నాన్న మేము ఎలా ఉన్నా అభ్యంతరం చెప్పకపోవడంతో (అభ్యంతరంగా ప్రవర్తించకుండా పెంచారనుకోండి) ఫ్రెండ్స్‌తో ఓలాగా, ఇంట్లో ఓలాగా ఉండడం మాకు అలవాటు లేదు.

ఒకాయన తన కూతురి పెళ్ళికి పిలుస్తూ "మా అమ్మాయి నా మాటే వింటుంది. పాతికేళ్ళకి పెళ్ళి చెయ్యాలనుకున్నాను, పాతికేళ్ళకే చేస్తున్నాను. పిల్లల్ని నాలా పెంచాలి.." అని అన్నారు.

"మరి వాళ్ళ అబ్బాయి తన మాట ఎందుకు వినలేదట? పెళ్ళి జరగకూడదని పూజలు వ్రతాలు ఎందుకు చేసారో కనుక్కోవాల్సింది" అన్నాను.

"నా పిల్లలు ఆరోగ్యంగా ఎవరిమీద ఆధారపడకుండా ఉన్నారు. నాకు అది చాలు. వాళ్ళకి ఆ మాటే అంటే సంతోషంగా ఉంటుందేమో. పోనీ అననీ. మనకి పోయేదేం లేదు కదా" అని బదులిచ్చింది మా అమ్మ.

అరుదుగా మాట్లాడే మా నాన్న "బురద మీద రాయి వెయ్యకూడదమ్మా!" అని ఒక్క వాక్యంలో సందేశాన్ని తెలిపారు.

ఓ రోజు ఒక బాగా దగ్గర బంధువు "కావ్యకి ఇక్కడ ఎవరూ దొరక్కపోతే అక్కడే ఎవడో ఒకడ్ని ఇచ్చి పెళ్ళి చెయ్యి" అని ఇచ్చిన ఉచిత సలహాకి మా అమ్మ హృదయం బరువెక్కింది. "కావ్యకి ఎవడో ఒకడ్ని ఇచ్చి చెయ్యాలా? హౌ డేర్ షీ? అలాంటి వాళ్ళ నంబర్ ఇంకా బ్లాక్ చెయ్యలేదేంటి?" అని కోపంగా నేను అరుస్తుండగా "పెళ్ళైతే అబ్బాయి గురించి, కాకపోతే మా గురించి అంటారు. అదీ ఒక మానసిక రోగమే. కాబట్టి వాళ్ళ మాటలకి విలువ ఇవ్వకూడదమ్మా" అని మా నాన్న చెప్పిన రెండు వాక్యాలు నన్ను శాంతింపజేసాయి.

నిజానికి అందరూ కావ్య గురించి అడగడం, మాట్లాడ్డం, పుకార్లు పుట్టించడం నన్ను ఆశ్చర్యపరచదు. ఎందుకంటే తను అంత విలువైన వ్యక్తి. ఏడు దేశాల్లో తొంభై మందిని సూపర్ వైజ్ చేస్తూ ఆబర్డీన్, మకే, స్టావెంజర్, దుబాయ్, ఔదాబీ వంటి దేశాల్లో పనిచెయ్యడమే కాక భాషరాని కాంగో, గేబాన్, నార్వే వంటి దేశాల్లో ఏళ్ళ తరబడి, ఒడిదుడుకులను ఎదుర్కొని, తన వృత్తిని ప్రేమిస్తూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ధైర్యాన్ని కోల్పోకుండా, చిరునవ్వుని వీడకుండా, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా కుటుంబానికే ప్రాధాన్యతని ఇస్తూ కేవలం సంతోషాన్నే పంచుకునే కావ్య గురించి మాట్లాడని వారు ఉండరు. "నా గురించి అడిగారా? నేనేమైనా సెలెబ్రిటీనా? వేరే పనిపాటా లేదా మీవాళ్ళకి?" అని కావ్య నవ్వుతుంది.

తను అంత స్ట్రాంగ్, ఇండిపెండెంట్‌గా ఉండడానికి ముఖ్యకారణం మా నాన్న. కావ్య అమెరికా వెళ్ళడానికి వారం రోజుల ముందు మా ముగ్గురిని తన గదిలోకి పిలిచారు. "కావ్య ఇప్పుడు ఇల్లు విడిచి వెళ్తుంది. మళ్ళీ వచ్చినప్పుడు గెస్ట్‌లా కొన్నిరోజులు ఉండి వెళ్ళిపోతుంది. మన కుటుంబమంతా ఇలా ఒకే ఇంట్లో కలిసి ఉండడం బహుశా మళ్ళీ జరగకపోవచ్చు. ఎంత దూరంగా ఉన్నా మీ ముగ్గురు టచ్‌లో ఉండాలి. ఫ్యామిలీ ఈజ్ ఇంపార్టెంట్. చివరికి మిగిలేది ఫ్యామిలీనే. ఏదైనా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఒకరికి ఒకరు సహాయంగా ఉండాలి.." అని మాకు బోధించారు. మా నాన్న చెప్పినవి కావ్య అక్షరానికి అక్షరం పాటిస్తుంది. ఏ కుటుంబంలో అయినా మొదటి పిల్లలపై బాధ్యత ఎక్కువగా ఉంటుంది. దాన్ని అందరూ మొయ్యలేకపోతారు. కానీ కావ్యకి కావలసిన ధైర్యాన్ని, స్ఫూర్తిని మా అమ్మా నాన్న చిన్న వయసునుండే అందించారు. కావ్య మొదటిసారి ఇల్లు విడిచినప్పటిలాగే పరదేశానికి వెళ్ళిన ప్రతిసారీ జాగ్రత్తలు చెప్తుంటారు. తనకి ఏ ప్రాబ్లం వచ్చినా మా నాన్నతో చర్చిస్తుంది కావ్య. చాలా ప్రాక్టికల్‌గా, స్పాంటేనియస్‌గా ఉండే మా నాన్న మేము ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్నా నవ్విస్తూ సహాయపడతారు. ఉదాహరణ, కావ్య గేబాన్ నుండి వెనక్కి వస్తున్న రోజు స్టమక్ అప్సెట్ అయ్యింది. "ప్రయాణానికి ఇబ్బంది కలుగుతుందేమో అని భయంగా ఉంది" అని మా నాన్నతో చెప్పిందట. "ఫరవాలేదమ్మా తగ్గిపోతుందిలే. పోస్ట్‌పోన్ చేసుకోకు. యు ఆర్ గివ్వింగ్ యా ఆర్ షిట్ టు గేబాన్ బికాస్ యు ఆర్ నెవర్ గోఇంగ్ బ్యాక్" అని అన్నారట. తను అన్నట్లుగానే ఎయిర్‌పోర్ట్ చేరేసరికి కావ్య ఆరోగ్యం కుదుటపడింది.

ఇంతకీ నేను పెళ్ళికి వ్యతిరేకం కాదు. "పెళ్ళైతే భర్త చూసుకుంటాడు", "ఇద్దరుంటే బాధ తగ్గుతుంది, "జీవితంలో తోడు అవసరం" వంటి వాక్యాలతో నేను ఏకీభవిస్తాను. భయంగా ఉన్నప్పుడు ధైర్యం చెప్తే బావుంటుంది. బాధపడుతున్నప్పుడు ఓదారిస్తే బావుంటుంది. కానీ ఏ సహాయం లేకుండా అన్ని వ్యవహారాలు చూసుకున్నప్పుడు కలిగే సంతృప్తి, పెరిగే ఆత్మ స్థైర్యం తోడుకావాలనే

కోరికని నెట్టేస్తుంది. ఐదేళ్ళుగా ఒంటరిగా ఉండి ఓవర్ ఇండిపెండెంట్ అయిన నాకు పెళ్ళి ప్రాముఖ్యత అర్ధమవ్వడానికి మా నాన్న ఎంత కష్టపడ్డారో మాకే తెలుసు. ఓవర్ ఇండిపెండెంట్ అంటే మామూలుకన్నా చాలా అధికంగా అని నా ఉద్దేశం. ఉదాహరణకి, కొన్ని నెలల్రకితం హైపోనాట్రీమియాకి ఎలెక్ట్రోలైట్స్ ఎక్కిస్తూ "డూ యు వాంటు కాల్ ఎనీవన్?" అని అడిగినప్పుడు "దట్స్ ఓకే. ఇట్స్ నాట్ దట్ సీరియస్" అన్నాను. అలాగే 2016లో జరిగిన ఓ చిన్న ఔట్ పేషెంట్ సర్జరీకి ఒక్కదాన్నే వెళ్ళి పోస్ట్ ఆపరేటివ్ కేర్ పూర్తయ్యాక ఇంట్లో అలారాలు పెట్టుకుని సమయానికి మందులు వేసుకున్నాను.

"మేము వచ్చాక సర్జరీ చెయ్యించుకోమ్మా"

"పోనీ మేము ఈ వారమే రామా?"

"ఒక్కదానివే కష్టమమ్మా" అని మా అమ్మా నాన్నా చాలాసార్లు అన్నారు. ఇంత చిన్న విషయానికి సహాయం అక్కర్లేదు అని వద్దన్నాను. సర్జరీకి ముందురోజు రాత్రినుండి నేను కోలుకునేంతవరకు మా నాన్న అనేక సార్లు ఫోన్ చేసి నా బాగోగులు అడిగారు. "జాగ్రత్తమ్మా అంతా బానే జరిగింది కదా? ఇబ్బందేం లేదు కదా మందులు వేసుకుంటున్నావుకదా" వంటి సంభాషణలు నాకు ఇంకా గుర్తున్నాయి. హాస్పిటల్‌లో అనెస్తీషియా ప్రభావంలో మా నాన్నకి పంపిన మెసేజీలు మత్తు వదిలాక నన్నే ఆశ్చర్యపరచినా మా నాన్న వాటి ప్రసక్తి ఎప్పుడూ తేలేదు. ఈ విధంగా ప్రత్యేకంగా ఏ సహాయం కోరని నేను పెళ్ళి చేసుకోవాలనుకునే వ్యక్తి ఎలాంటి గుణాలు కలిగి ఉండాలో మీరే ఊహించుకోండి.

"మల్లాది వాళ్ళ అమ్మాయిని మా ఇంటి కోడలు చేసుకోవాలనుకుంటున్నాము" అని చాలామంది అడిగారు. ఐ.పి.ఎస్ ఆఫీసర్‌ని వద్దు అనుకున్నవారు 'నేను పోలీస్ టెక్నీషియన్‌ని చేసుకుంటా' అన్నా అంగీకరిస్తామని తెలిపారు. "ఆ సినిమా రాసిన అబ్బాయి ఎవరో తెలుసా? నాకు బాగా నచ్చింది" అన్న వెంటనే తెలిసిన వాళ్ళద్వారా పరిచయం చేసారు. ఆ పరిచయం ప్రేమగా మారుతుందని, లేదా ప్రేమించడం వల్లే పరిచయం జరిగిందని వాళ్ళ స్నేహితులు భావించినా నాపై ఉన్న నమ్మకంతో జాగ్రత్తలు, ఉపన్యాసాలు చెప్పలేదు.

ప్రతి విషయంలో మా అమ్మని వింత ప్రశ్నలతో విసిగించే నేను, "ఒకవేళ ఇంగ్లీష్ రాని ఇటాలియన్‌ని పెళ్ళి చేసుకుంటే ఏం చేస్తావ్?" అని ఓ రోజు అడిగాను.

"ఏముంది, ఇటాలియన్ నేర్చుకుంటాను. ఓ భాషైనా వస్తుంది" అని పాజిటివ్‌గా సమాధానమిచ్చింది.

మరోసారి "నేను నల్లబ్బాయిని చేసుకుంటాను అంటే?" అని అడిగాను.

"నల్లవాళ్ళంటే నాకు భయం పండు. వాళ్ళు మాత్రం వద్దు" అని మా అమ్మ అనడం విని "నల్లవాళ్ళైతేనే? మంచి వాడినే చేసుకుంటుంది" అని మా నాన్న నాపై విశ్వాసాన్ని వ్యక్తం చేసారు.

"అయినా సరే వాళ్ళు నాకు భయం" అని మా అమ్మ,

"మంచి వాడ్ని చేసుకుంటే ఇంక భయమేంటి?" అని మా నాన్న చర్చలో మునిగారు.

ఆలూలేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లుగా అనవసరంగా నా వల్ల వారు గొడవపడడం ఇష్టంలేక "సరేలే. నల్లబ్బాయిని చేసుకోను" అన్నాను.

"కటిక నలుపుకాకపోతే చాలు. ఒబామాల హాఫ్ నల్లబ్బాయి అయితే నాకు ఓకే నాన్న" అని మా అమ్మ పాపం రాజీ పడింది. ఊహ పెళ్ళి కుదిరిన సందర్భంలో మాట్లాడుతూ "నువ్వూ చేసుకుంటావా పండు?" అని మా అమ్మ ఉత్సాహంగా అడిగింది.

"యా. చేసుకుంటాను" అన్నాను.

"ఎవరా అబ్బాయి? నాకు తెలుసా?" అని ఆనందంగా అడిగింది.

"యా. తెలుసు. కానీ మర్చిపోయి ఉంటావు" అన్నాను.

"పేరేంటి?" అన్న వెంటనే "కేత్" అన్నాను.

"కేతా? తెలీదే?" అని బదులిచ్చింది.

"చెప్పానుగా మర్చిపోయి ఉంటావని" అన్నాను.

"కలిసానా?" అని ఆలోచిస్తూ ప్రశ్నించింది.

"లేదు. కానీ చూశావు. చూస్తే గుర్తుపడతావు" అన్నాను.

"ఎవరు? ఇంకా గుర్తురావట్లేదు" అంది.

"సరే. కొన్ని హింట్స్ ఇస్తా. ఆ అబ్బాయి ఆస్ట్రేలియన్" అని మొదలు పెట్టాను.

"మీ ఆఫీసులో పనిచేస్తాడా?" అని అడిగింది.

"కాదు. ఆ అబ్బాయి మ్యుజిషియన్. గిటార్ ప్లే చేస్తాడు. పాటలు కూడా పాడతాడు" అన్న వెంటనే "మ్యుజిషియన్‌కి ఎక్కువ సంపాదన ఉండదు పండు. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ వస్తుంది" అని దిగులుగా అంది.

"ఏం కాదు. ఈ అబ్బాయి చాలా రిచ్. లాంగ్, బ్లాండ్ జుట్టు" అని రెండో హింట్ ఇచ్చాను.

"పొడుగు జుట్టా?" అని బాధపడుతూ అడిగింది.

"ఔను. టాటూస్ కూడా ఉన్నాయి" అని ఆఖరి హింట్ విసిరాను.

"అలాంటి అబ్బాయిని చూస్తే మర్చిపోయేదాన్నికాదు. నాకైతే ఇష్టంలేదు. కానీ నీ యిష్టం. ఆలోచించు పండు" అని చింతిస్తూ ఫోన్ పెట్టింది.

ఈ సంభాషణ జరిగిన రెండురోజుల తర్వాత కూడా తన మనసు కకావికలంగా ఉందని తెలుసుకుని కీత్ అర్బన్ ఫోటో పంపాను.

" ఇతను అమెరికన్ ఐడల్ జడ్జ్ కదా?" అని అడిగింది.

వెంటనే ఫోన్ చేసి "ఔను. మొన్న చెప్పిన ఆస్ట్రేలియన్, గిటారిస్ట్, లాంగ్, బ్లాండ్ హెయిర్, టాటూస్ ఉన్న అబ్బాయి ఇతనే. చూస్తే గుర్తుపడతావని చెప్పానుకదా" అని నవ్వుతూ అన్నాను.

"దున్నపోతా. నేను ఎంత బాధపడ్డానో తెలుసా?" అంది.

"తెల్సులే తల్లి. వైట్ కాలర్ జాబ్ ఉన్న అబ్బాయినే చేసుకుంటానులే" అని ఆ రోజు మాటిచ్చాను.

"ఎవరిమీదా డిపెండ్ అవ్వకు. నీ కాళ్ళమీద నువ్వు నిలబడాలి. సహాయం కావాలంటే మేమున్నాము" అని ధైర్యం చెప్తూ మా అమ్మా నాన్నా పెంచారు. "ఐయామ్ జస్ట్ ఎ ఫోన్ కాల్ అవే" అని హామీ ఇస్తూ కావ్య, ఊహతోపాటు నందుకూడా ఉన్నారు. 'సంస్కృత పండితులు, జ్యోతిష్య విద్వాంసుల మనవరాలు ఈ గుణాలున్న అబ్బాయిని చేసుకుంటాను అంటే వారు ఎలా స్పందించేవారు?' అన్న ఆలోచన నా మెదడులో మొదటిసారి మూడేళ్ళ క్రితం వచ్చింది. ఎన్నడూ చూడకపోయినా మా తాతయ్యల ఆశీస్సులు లేకుండా నా పెళ్ళి జరగదని నిశ్చయించుకున్నాను.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story